క్లుప్తంగా

ఎరువుల యాజమాన్యంపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: వరి సాగులో ఎరువుల యాజమాన్యంపై రైతులు తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని గొల్లపాలెం, బందనపూడి తదితర గ్రామాల్లో ఏట పంట పొలాలను సందర్శించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ పంటలపై రైతులు అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులు వాడటం అనర్థాలకు దారి తీస్తుందన్నారు. పంటలకు సోకే తెగుళ్ల, వాటి ఉధృతి, పంట స్థితిగతులకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు. రెండు, మూడు రకాల మందులను కలిపి వాడుతుండటంతో ఏ మందు పని చేయక వృథా వ్యయాలు అవుతున్నాయన్నారు. ఫలితంగా ఖర్చు పెరిగి రైతుల నికర ఆదాయం తగ్గుతుందన్నారు. రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ మేలైన దిగుబడులు సాధించాలన్నారు.

పరిసరాల శుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం


గొల్లపాలెంలో చెత్తను ట్రాక్టర్లపై తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

కాజులూరు: పరిసరాల శుభ్రతపైనే ఆ గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులు ఆధారపడి ఉంటాయని గొల్లపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు అన్నారు. సోమవారం గ్రామంలో పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించి పలు గ్రామ వీధుల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెప్పకుప్పలను టాక్టర్లపై బయటకు తరలించారు. ఆయన మాట్లాడుతూ చైనీయుల ఆహారపు అలవాట్లు, పరిసరాల శుభ్రత లోపాల కారణంగానే కరోనా వ్యాధి విజృంభణకు కారణమయిందన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించటం ద్వారా కాలుష్య నివారణ జరిగి ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు.

భీమేశ్వరాలయ రికార్డుల పరిశీలన


ద్రాక్షారామ భీమేశ్వరాలయ గెస్ట్ హౌస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న విచారణ కమిటీ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ రికార్డులను ప్రత్యేక విచారణ కమిటీ రాజమహేంద్రవరం దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచన మేరకు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణలో భాగంగా దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ జ్యోతి, డిప్యూటీ కమిషనర్ ఎస్ఎస్ చక్రధరరావు, ఈఓలు ఎస్.సన్యాసిరావు, కె.శ్రీనివాసరావు, వెంకట్రావు, అసిస్టెంట్ ఇంజినీర్ ఈశ్వర్, సీనియర్ అసిస్టెంట్లు ఆచంట శ్రీనివాస్, వెంకటరావులు రికార్డుల తనిఖీలో పాల్గొన్నారు.

పెన్సిళ్లు, పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు భోజనాలు వడ్డన చేస్తున్న అశోక్‌కుమార్

మండపేట: మెర్నిపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గారపాటి అశోక్‌కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు పెన్సిళ్లు, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంపీపీ పాఠశాలకు వెళ్లి పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి చిన్నారులకు పంచారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గారపాటి సౌజన్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఆయన అభిమానులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో అబ్బులుకు గోల్డ్ మెడల్

ఆలమూరు: మండలంలోని కలవచర్లకు చెందిన క్రీడాకారుడు తాతపూడి అబ్బులు ప్రతిష్టాత్మక క్రియేటివ్ ఫామ్ వెపన్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దానవాయిపేటలోని ఎస్‌కేవీటీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఇటీవల 31వ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో క్రీడాకారుడు అబ్బులు చక్కని ప్రతిభను కనబర్చి గోల్డ్ మెడల్ సాధించారు. రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ బాబు చేతుల మీదుగా అబ్బులు సోమవారం గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు.

నాడు సేవకులు.. నేడు బాధితులు

- సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్
- ఐదేళ్లూ గౌరవంగా చూసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో పని ఒత్తిడితో సతమతం
- అధికారులు–నాయకుల మధ్య నలిగిపోతున్న వైనం


వైఎస్‌జగన్ హయాంలో వల్లూరు సచివాలయంలో గంట సమయంలో మంజూరైన రేషన్ కార్డును అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)

కపిలేశ్వరపురం: ప్రభుత్వ ఉద్యోగులంటే సుపరిపాలనకు కార్య సాధకులు. పాలకుడి నిర్ణయాలు ప్రజానుకూలమైతే వాటిని అమలు చేసే ఉద్యోగులకు ఇష్టంగా పనిచేస్తారు. దీంతో మంచి పేరు లభిస్తుంది. అదే పాలన అక్రమార్గాన నడిస్తే ఉద్యోగులు కష్టంగా గడపాల్సి వస్తుంది. అదే జరుగుతోంది క్షేత్ర స్థాయిలోని సచివాలయ ఉద్యోగుల పరిస్థితి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను రూపొందించారు. తన హయాంలోని ఐదేళ్లూ వారిని ప్రజా ప్రయోజనాలు మేరకే విధులను కేటాయించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాకా వలంటీర్ వ్యవస్థను పక్కనపెట్టి వారి విధులను సచివాలయ ఉద్యోగులపై మోపింది. ఇలా అనేక పద్ధతుల్లో వారిపై పని ఒత్తిళ్లను పెంచుతోంది. దీనికితోడు ఇసుక ర్యాంపులు వద్ద విధులను కేటాయించడంతో అక్కడ జరిగే అక్రమాల నడుమ ఉద్యోగులు నలిగిపోతున్నారు.

సచివాలయ వ్యవస్థ నేపథ్యమిదీ

2019కు ముందు రాష్ట్ర పాలనలో ధనం, మందిబలం, సామాజిక పెత్తందారీతనం సామాన్య ప్రజలపై కొనసాగింది. దానికి తోడు కొందరి అధికారుల అలసత్వం ప్రజలను పీడించింది. ఈ అవరోధాలను ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా దగ్గర నుంచి చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి రాగానే పాలన మొత్తాన్ని ప్రజల వద్దకు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అపూర్వ మద్దతుతో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వం ప్రజలకు చేరువైంది. మొక్కుబడి కార్యాచరణ కాకుండా ఒక్కో సచివాలయంలో 10 నుంచి 11 మంది ఉద్యోగులను నియమించి సంక్షేమాన్ని చేరువ చేసింది. ఎక్కడా లేని బలోపేతమైన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను దేశం మొత్తం ప్రశంసించింది. కేరళ వంటి ఇతర రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఈ వ్యవస్థలను పరిశీలించి అభినందించారు. అంతటి వ్యవస్థలను నేటి కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది.

రెండు నియోజకవర్గాల్లో జనాభా ఇలా..

మండపేట నియోజకవర్గంలోని 43 గ్రామాల పరిధిలో 79,406 కుటుంబాల్లో 2,65,944 మంది జనాభా ఉన్నారు. రామచంద్రపురం మండలంలోని 77 గ్రామాల్లోని 70,450 కుటుంబాల్లో 2,43,410 మంది ప్రజలున్నారు. మండపేట పట్టణ మున్సిపాలిటీలో 29 వార్డుల పరిధిలో 17 వార్డు సచివాలయాలున్నాయి. 12 రూరల్ గ్రామాల్లో 23 సచివాలయాలున్నాయి. 19 గ్రామాలున్న కపిలేశ్వరపురంలో 20, 12 గ్రామాలున్న రాయవరంలో 19, నియోజకవర్గం మొత్తంలో 79 సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వాటి పరిధిల్లో 512 మంది సచివాలయ ఉద్యోగులున్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీలో 12, రూరల్ గ్రామాల్లో 20, కె.గంగవరం 23, కాజులూరు 23 నియోజకవర్గం మొత్తంలో 78 సచివాలయాలున్నాయి.


కూటమి ప్రభుత్వంలో ఇసుక ర్యాంపు వద్ద కాపలా కాస్తున్న సచివాలయ ఉద్యోగులు

అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఉద్యోగులు

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులు, రైతులు, సాధారణ ప్రజలు ధృవీకరణ పత్రాలను పొందేందుకు మండల కార్యాలయం చుట్టూ తిరిగేవారు. మీ సేవే కేంద్రాల సంఖ్య పరిమితంగా ఉండడంతో పాటు వాటిలో అందించేసేవలు తక్కువగా ఉండేవి. దీంతో ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ పథకంలో లబ్ధి పొందాలన్నా ప్రజలు అవస్థలు పడేవారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోని సచివాలయ వ్యవస్థ ప్రజా పాలనలో అద్భుతాలను సృష్టిస్తోంది. గత ప్రభుత్వంలో అసాధ్యం అనుకున్న పనులను సచివాలయ ఉద్యోగులు సుసాధ్యమని నిరూపిస్తున్నారు. వల్లూరు, టేకి తదితర అనేక గ్రామాల్లో అర గంటలో రేషన్ కార్డును మంజూరు చేసి చూపించారు.

ఇసుక ర్యాంపు డ్యూటీలతో యాతన

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో వరదల కాలంలో వినియోగార్థం కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల్లో ఇసుక నిల్వలను ఉంచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా జూన్ 13న ఆ నిల్వలను అక్రమంగా తరలించే ప్రయత్నం కూటమి నేతలు చేశారు. ప్రజలు అడ్డుకోవడంతో ఆ నాడు తాత్కాలికంగా ఆగారు. ఇంతలో ఇసుక నిల్వలు వద్ద సచివాలయ ఉద్యోగులకు డ్యూటీలు వేసి కాపలా ఉండాలంటున్నారు. ఒక పక్క నిల్వలను అక్రమంగా తరలించేందుకు ఉత్సాహం చూపుతుండగా వాటికి కాపలాగా ఉండమనడంతో సచివాలయ ఉద్యోగుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఇసుక నిల్వలను కాపాడాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వగా, మేం చూసుకుంటాం మీకెందుకంటూ అక్రమాలకు తావిస్తున్నారు కూటమి నేతలు. ఇలా తీవ్ర మానసిక వేదనకు సచివాలయ ఉద్యోగులు గురవుతున్నారు.

వలంటీర్లను పక్కనపెట్టడంతో..

సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు వైఎస్ జగన్ పాలనలో ఉండేవి. ఆ వ్యవస్థలతో పేదలకు సంక్షేమ పథకాలు అందించే వలంటీర్ వ్యవస్థను నేటి కూటమి పక్కన పెట్టింది. దీంతో ఆ పని భారాన్ని సచివాలయ ఉద్యోగులపై మోపింది. సచివాలయాల్లో ఖాళీగా కూర్చుని ఏం చేస్తారంటూ పలువురు కూటమి నేతలు వెటకరించిన పరిస్థితులు క్షేత్ర స్థాయిలో ఉంటున్నాయి.

ఈ-పంట నమోదు పరిశీలన


ఏరుపల్లిలో క్షేత్రస్థాయి ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ రంగారావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లిలో రామచంద్రపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఏవీఎస్ రంగారావు సోమవారం ఈ-పంట నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకుల పనితీరును పరిశీలించి సూచనలు చేశారు. అదే విధంగా రైతులకు ఈ-పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వాస్తవ సాగుదారులను క్షేత్రస్థాయి పరిశీలన చేసి గుర్తించాలని వ్యవసాయ సహాకులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.రాహుల్ అంబేడ్కర్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్లకు వేలం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో పరిధిలోని కొబ్బరి చెట్లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం డిపో గ్యారేజీ ఆవరణలోని 42 చెట్లకు, అదే విధంగా ద్రాక్షారామ బస్‌స్టేషన్ ఆవరణలోని 5 కొబ్బరి చెట్లకు కలసి మొత్తం 2 సంవత్సరాల పాటు కొబ్బరి కాయలు తీసుకొనుటకు హక్కు కల్పించే విధంగా ఈ నెల 17న శనివారం మధ్యాహ్నం 3 గంటలకు డిపోలోని సెక్యూరిటీ కార్యాలయం వద్ద నిర్వహించే వేలంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు. మరింత సమాచారం కోసం తమ కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం: ఏపీ ట్రాన్స్‌కో ప్రధానమైన 132 కేవీ రామచంద్రాపురం సబ్‌స్టేషన్‌లో ఎక్విప్‌మెంట్ మార్పు చేయుటంతో నేడు(మంగళవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కాకినాడ ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఖాజా రహంతుల్లా, రామచంద్రపురం ఆపరేషన్ ఈఈ వై.విజయానంద్, అమలాపురం ఆపరేషన్ ఈఈ రవి కుమార్‌లు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముమ్మిడివరం, కొత్తపేట, అమలాపురం, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని చుట్టుపక్కల ఏరియాల్లో నేటి ఉదయం 8 నుండి 12 గంటల మధ్యలో అప్పుడప్పుడూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పాలిటెక్నిక్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రామచంద్రపురం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమస్యలు తక్షణం పరిష్కరించాలని, ప్రత్యామ్నాయం చూపించకుండా పాలిటెక్నిక్ కాలేజీని తొలగించాలనే నిర్ణయం సరైంది కాదని, పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి వినతిపత్రాన్ని అందజేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ రామచంద్రపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 2014లో కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎండోమెంట్ భవనంలో క్లాసులు ప్రారంభించారని, అప్పట్లో సుమారు 400 మంది విద్యార్థులు ఉండేవారిని వివరించారు. ప్రభుత్వ కళాశాలలో సౌకర్యాలు లేక ఏఐసీటీఈ నిబంధనలు అమలు చేయక సీట్లు తొలగించుకున్నారని, క్రమేపీ సీట్లు తగ్గడంతో ఇప్పుడే 120 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. కనీసం తాగడానికి కూడా వాటర్ లేదని, విద్యార్థులకు సరిపడే తరగతి గదులు లేవని విమర్శించారు. పాలిటెక్నిక్ కాలేజీలో ఇప్పుడు 120 సీట్లు ఉన్నాయని. సరైన సౌకర్యాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగడానికి వాటర్ లేక బోధన అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సిద్ధూ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉన్న స్థలం కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎండోమెంట్ ట్రస్ట్‌కు చెందిన ఆస్తి అని, ప్రభుత్వం జూనియర్ కాలేజీ గ్రౌండ్ పక్కన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐదెకరాల స్థలం కేటాయించిందన్నారు. అయినా కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎండోమెంట్ భవనంలోనే తరగతుల నిర్మాణం చేస్తున్నారని, పాలిటెక్నిక్ కాలేజీకి అగ్రహారంలో 4.30 ఎకరాల్లో పదేళ్ల నుంచి నిర్మిస్తున్నారని, నేటికీ అది పూర్తి కాలేదని ఆ భవనాన్ని తక్షణమే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవోకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ పీడీఎస్‌యూ నాయకులు కె.నవీన్‌కుమార్, సాయిరాం, డి.ఆదిత్య, బి.తేజ సాయిరాం, పి.తేజ, భీమేష్ మౌనిక, భార్గవి, హర్షిణి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పరామర్శ


కాకినాడ ఆస్పత్రిలో వాసంశెట్టి శ్రీనును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: కాండ్రేగుల గ్రామ శివారు గుబ్బలవారి పాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త వాసంశెట్టి శ్రీను ఇటీవల అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీనుతోపాటు ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం పరామర్శించారు. మెడికల్ రిపోర్టులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట కాండ్రేగుల ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ, కట్టా విజయరాజు, నాయకులు పాల్గొన్నారు. రంగంపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలాటి నాగేశ్వరరరావు భార్య (మాజీ రాష్ట్ర చేనేత కార్పొరేషన్ డైరెక్టర్) అమ్మాజీ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆమెను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. కంటిపూడి నాగేశ్వరరావు, గారపాటి వెంకటరావు, యర్రమాటి సత్తిబాబు, ఆళ్ల దుర్గారావు, పసల్ల జానకి రామ సుర్యారావు, కంటే సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మత్తుకు అలవాటు పడి జీవితాలు పాడు చేసుకోవద్దు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బిక్కిన

మండపేట: మాదక ద్రవ్యాలకు అలవాటు జీవితాలు పాడుచేసుకోవద్దని ప్రముఖ వైద్యుడు బిక్కిన గోపాల కృష్ణ అన్నారు. మండలంలోని మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బిక్కిన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేటి యువవత మత్తుకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. అటువంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఉద్బోధించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యవ్వనం మనిషికి దేవుడు ఇచ్చిన వరమని యువత పొగాకు ఉత్పత్తులకు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. చదువులపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథిని అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ కేఎస్ఆర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం


కబడ్డీ పోటీలు ఆడుతున్న విద్యార్థులు

కె.గంగవరం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎంఈఓ ఎ.నాగరాజు అన్నారు. మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో సోమవారం వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆ రోజు విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. తొలుత ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. అనంతరం క్రీడా మైదానంలో కోకో, కబడ్డీ పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, కేవీ శ్రీనివాస్, పీడీ శ్రావణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల నిరసన


డీవైఈఓకు నోటీసు అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ ఉపాధ్యాయ పని సర్దుబాటు విధానాన్ని బహిష్కరిస్తూ రామచంద్రపరం పట్టణ ఫ్యాప్టో నాయకుల ఆధ్వర్యంలో రామచంద్రపురం ఎంఈఓ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అసంబద్ధ విధానాలను తొలగించాలని, జీఓ నెం.117ను రద్దు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలోను, రామచంద్రపురం డీవైఈఓ శ్రీపాద నరసింహఫణిలకు పని సర్దుబాటు బహిష్కరణ నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు రాయుడు శ్రీనివాస్, డీవీవీ సత్యనారాయణ, కాదా శ్రీరాములు, గరగ ఈశ్వరరావు, పీఎస్‌వీ రమణ, కట్టా శ్రీనివాస్, డి.వీరేంద్రబాబు, కేవీవీ సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం


గొల్లలచెరువులో పాడి రైతులకు పోషకాలు అందజేస్తున్న ఏడీ రామకృష్ణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల శివారు గొల్లల చెరువులో వెల్ల పశువైద్యశాల, కృత్తివెంటి పేర్రాజు పంతులు పశు సంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఒ.రామకృష్ణ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, వ్యాధుల బారిన పడినప్పుడు అందించాల్సిన వైద్యం గురించి పాడి రైతులకు వివరించారు. వెల్ల పశు వైద్యాధికారి పి.రామచంద్రరావు మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సబ్సిడీ పథకాలను వివరించారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, మినరల్ మిక్చర్, కాల్షియం, లివర్ టానిక్స్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు పశు వైద్య పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జె.జయలక్ష్మి, కందులపాలెం జూనియర్ పశు వైద్యాధికారి పి.త్రినాథ్ రావు, పశు సంవర్ధక శాఖ సహాయకులు, గోపాల మిత్రలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తూ పాలన సాగించాలి


సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం

కె.గంగవరం: పంచాయతీరాజ్ యాక్ట్ నిబంధనలు పాటిస్తూ పంచాయితీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాలన సాగించాలని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ సూర్యారావు అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరం స్త్రీ శక్తి భవనంలో సోమవారం మూడు రోజుల ట్రైనింగ్ ప్రోగ్రాంను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ప్రతి పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ తప్పక ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ ఆదాయానికి అనుగుణంగా ఎటువంటి పనులు చేయాలని, ఎటువంటి పనులు చేయకూడదు, పంచాయతీ రాజ్‌లో పలు యాక్ట్‌ల గురించి వారు సవివరంగా వివరించారు. ఈఓపీఆర్డీ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్‌వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, మాస్టర్ ట్రైనర్ వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్క్రూటినీ, స్ట్రీట్ లైట్స్(ఎల్ఈడీ) తదితర అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కృషి

మండపేట: పంచాయితీ వ్యవస్థ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణ తరగతుల జరగనున్నాయి. ఎంపీడీవో శ్రీదేవి అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఐదం రాజు, కార్యదర్శులు, సర్పంచ్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమాశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

పంచాయతీ పాలనపై అవగాహన

కపిలేశ్వరపురం: పంచాయతీ కార్యకలాపాలపై ప్రజాప్రతినిధులకు పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులకు సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ కొండలరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 14 వరకూ శిక్షణ కొనసాగించనున్నట్టు ఎంపీడీఓ కొండలరావు తెలిపారు.

రాయవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ శిక్షణను ఎంపీపీ నౌడు వెంకటరమణ ప్రారంభించారు. అనంతరం మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు.

ఎమ్మెల్సీ తోట పరామర్శ

మండపేట: కుటుంబ సభ్యులను కోల్పోయి బాధపడుతున్న పలు కుటుంబాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. 28వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు మొండి మురళి తండ్రి ఇటీవల అనారోగ్యం బారిన పడి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. 26వ వార్డు కౌన్సిలర్ అమలదాసు లక్ష్మి రుద్రమూర్తి అన్నయ్య కుమార్తె ప్రమాదానికి గురై మరణించడంతో వారి కుటుంబ సభ్యులను తోట పరామర్శించారు. తన సానుభూతిని తెలియజేశారు. పరామర్శలో కౌన్సిలర్ నీలం దుర్గమ్మ, ఎర్నేని ప్రభావతి, శెట్టి కళ్యాణి, మలసాని సీతామహలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు షేక్ అలీఖాన్‌బాబా, కొప్పిరెడ్డి పద్మావతి, కనికెళ్ల పల్లవి, శెట్టి నాగేశ్వరరావు, సాధనాల శివభగవాన్, పేకేటి మాణిక్యం, కానూరి వీరపండు, జోసఫ్, జెట్టి బాబూరావు తదితరులు ఉన్నారు.


కౌన్సిలర్ మురళి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట